క్లుప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవర్లీ బేస్డ్ టీచర్స్ (హెచ్‌బీటీ) పద్ధతిలో ఈ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక పీరియడ్‌కు రూ.182 చొప్పున నెలకు 100 పీరియడ్లకు గౌరవ వేతనం చెల్లిస్తారని చెప్పారు. హెచ్‌బీటీ కెమిస్ట్రీ పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుకు ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఈడీ అర్హత ఉండాలన్నారు. హెచ్‌బీటీ మ్యాథ్స్ పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుకు ఎంఎస్సీ మ్యాథ్స్, బీఎడ్ లేదా బీటెక్, బీఎడ్ అర్హత ఉండాలని తెలిపారు. నెలకు రూ.10 వేల గౌరవ వేతనంతో మెంటర్ ఫర్ అటల్ టింకరింగ్ ల్యాబ్ పోస్టుకు బీఎస్సీ ఎలక్ట్రానిక్ లేదా బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 14వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేయాలన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా ఆనంద్



శంషాబాద్: ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన శంషాబాద్ మండలానికి చెందిన జిల్లా ఆనంద్ ముదిరాజ్ ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ ఉత్తర్వులు అందజేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఆనంద్ అన్నారు. తనపై బాధ్యతలు అప్పగించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కేన్సర్ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

శంషాబాద్: త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కేన్సర్ రోగులకు శుక్రవారం ఆర్‌బీనగర్‌లో పౌష్టికాహారం పంపిణీ చేశారు. కేన్సర్ బాధితులకు త్రినేత్ర ఫౌండేషన్ అండగా నిలవడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరీనరేందర్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాకీథెరపీ వర్క్‌షాపు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ (ఏఓఐ)లో ప్రొస్టేట్ క్యాన్సర్‌పై బ్రాకీథెరపీ వర్క్‌షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. రేడియేషన్ ఆంకాలజిస్టులు, మెడికల్ ఫిజిస్ట్‌లకు నిపుణులైన అంతర్జాతీయ ఫ్యాకల్టీచే బ్రాకీథెరపీపై లైవ్ కేస్ డెమో నిర్వహించారు. సొసైటీ ఆఫ్ రేడియేషన్ ఆంకాలజీ ఫెలో, అమెరికన్ బ్రాకీథెరపీ సొసైటీ డాక్టర్ సుశీల్ బేరివాల్, డాక్టర హర్జోత్ కౌర్‌లు మాట్లాడుతూ ప్రొస్టేట్ క్యాన్సర్ చికిత్స బ్రాచిథెరపీలో రేడియేషన్‌ను నేరుగా ప్రొస్టేట్ గ్రంథిలోకి ప్రవేశపెడతారని, దీంతో రేడియేషన్ ఆ ప్రాంతానికి పరిమితమవుతుందని శరీరం మొత్తాన్ని ప్రభావితం చేయదన్నారు. డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రాయదుర్గం: మధురానగర్ ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 16న అమ్మవారికి లక్ష గాజుల అలంకారం చేయాలని నిర్ణయించినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రధాన అర్చకులు సాయిశర్మ తెలిపారు. కాగా సెప్టెంబర్ 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరుగుతుందని వివరించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి అందించడం జరుగుతుందని వారు వివరించారు. పూజ అనంతరం భక్తులకు పసుపు,కుంకుమ, గాజులు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

నియామకం

రాయదుర్గం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఇద్దరు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌నర్సింగరావు, రాష్ట్ర ఇన్‌చార్జీ అక్షయ్‌లక్రా నియామకపత్రాలను అందించారు. ఎన్‌ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శులుగా సి సునీల్‌కుమార్, సోమన్నగారి రచనారెడ్డిలను నియమించారు. ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ శాఖకు సునీల్‌కుమార్ అధ్యక్షుడుగా పనిచేశారు. ప్రస్తుతం రచనారెడ్డి ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'హియరింగ్ కేర్ ఫర్ ఆల్' అనే అంశంపై మీనాక్షి వెంకట్రామన్ ఫౌండేషన్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎం రంగనాథన్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

ఏసీ బస్టాప్ ఉన్నా.. బయటే..

మాదాపూర్ శిల్పారామం వద్ద ప్రయాణికుల దుస్థితి

మాదాపూర్: లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఏసీ బస్టాప్ నిరుపయోగంగా మారింది.అన్ని హంగులతో 40లక్షల రూపాయలు వెచ్చించి ప్రయాణికుల కోసం శిల్పారామం ఎదుట ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ లోపం వల్ల అధ్వానంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు మాదాపూర్ నుండి వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. ఇక్కడ ప్రయాణికులకు వైఫై, తినుబండారాల కోసం చిన్న స్టోర్, చిన్నపిల్లల ఫీడింగ్‌కు ప్రత్యేక గది, కాఫీ షాప్, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. చుట్టూ సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. కానీ కొద్ది రోజులకే అది నిరుపయోగంగా మారింది. రోడ్డు పక్కనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రణాళిక బద్ధంగా నిర్వహణ లేకపోవడం వల్ల ప్రయాణికులకు అందుబాటులోకి రావడం లేదన్నారు.





ఏసీ బస్టాప్ వద్ద వృథాగా స్టాల్స్, టాయిలెట్స్



మాదాపూర్‌లోని శిల్పారామం వద్ద నిరుపయోగంగా ఉన్న ఏసీ బస్టాప్



పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా ఉన్న వాటర్ ట్యాంక్, ఎండిపోయిన గ్రీనరీ



పేరుకే ఏసీ బస్టాప్..



ఏసీ బస్టాప్ ప్రారంభించిన కొత్తలో ప్రయాణికులు సంతోషపడ్డారు. అది కొంతకాలానికే నిరుపయోగంగా మారింది. మాదాపూర్ ప్రాంతం నుండి వేలాది మంది ప్రయాణం చేస్తుంటారు. ఎలాంటి మౌలిక వసతులు లేకపోగా రోడ్డు బైటనే నిలబడాల్సి వస్తుంది. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **–జేడీ, ప్రయాణికుడు,**

సాధారణ బస్టాప్‌గా మార్చాలి



ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, సీనియర్ సిటిజన్‌లు కూర్చోడానికి కూడా వీలు లేదు. బస్టాప్ లోపల కూర్చోవడానికి లేకుండా తాళాలు వేశారు. ఎవ్వరు వినియోగించుకోలేని పరిస్థితి. కనీసం సాధారణ బస్టాప్‌గా వాడుకలోకి తీసుకురావాలి. అధికారులు, నాయకులు స్పందించాలి. **– లక్కీ, స్థానికుడు**

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: ఇబ్రహీంబాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మైస్కాప్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు డిస్ట్రిక్ట్-1, 2 లేన్, కోకాపేట్ గేట్-1, నెమలీనగర్ అండ్ జయబేరీ, కోర్టు యార్డ్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాలు, క్రిన్స్ విల్లాస్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు క్రిన్స్ విల్లాస్, సర్వీస్ రోడ్, జయబేరి టూ వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్స్, నీలిమానగర్ ఫీడర్‌లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మై హోమ్ అవతార్ టూ అపోర్డ ఎక్సోన్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. డాన్ బాస్కో ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు మైకెల్ కాలనీ, వినాయకనగర్, డీడీ కాలనీ, కాళీ మందిర్, ఎన్‌ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడామీ, అభ్యుదయానగర్, అరునోదయ నగర్, సంధ్యానగర్, జీఆర్ నగర్, మాచెన్‌పల్లి ఎన్‌క్లేవ్, అజీజ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలీస్ అకాడామీ, ఉమాపతిఫామ్ హౌజ్, గెస్ట్ హౌస్, హెర్బల్ గార్డెన్, అజీజ్‌నగర్, డీర్ పార్క్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందని తెలిపారు.

మణికొండలో జిల్లా ఉపవైద్యాధికారి తనిఖీ

మణికొండ: బస్తీ దవాఖానాలో డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా.. వైద్యం మంచిగా చేస్తున్నారా.. బీపీ, షుగర్ మందులను అడిగిన వెంటనే ఇస్తున్నారా అంటూ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సృజన మణికొండలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న బస్తీ దవాఖానా పనితీరుపై ఆమె స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గతంలో షుగర్, బీపీ టాబ్లెట్లకు, రక్త పరీక్షలకు వందలాది రూపాయలు ఖర్చు చేసే వాళ్లమని ప్రస్తుతం మణికొండలో బస్తీ దవాఖానా ఏర్పాటు కావటంతో అక్కడే ఉచితంగా పరీక్షలను చేయించుకోవటంతో పాటు మందులను తీసుకుంటున్నామని వివరించారు. రోగులు వచ్చిన సమయంలో అందుబాటులో ఉండి వారికి సరైన వైద్య సలహాలతో పాటు వారు అడిగిన అన్ని రకాల మందులను అందజేయాలని ఆమె వైద్యులకు సూచించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ పద్మ, బస్తీ దవాఖానా డాక్టర్ ఇక్బాల్ ఫారూఖ్, వైద్య విస్తరణాధికారులు శ్రీనివాస్, అన్నపూర్ణ, బలరాం పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి సృజన

'కేసీఆర్ భూ దాహానికి పేదలు బలవుతున్నారు'



రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ జాతీయ కిసాన్ సెల్ అధ్యక్షుడు కోదండరెడ్డి

రాజేంద్రనగర్: సీఎం కేసీఆర్, కేటీఆర్ భూదాహానికి పేద రైతులు బలైపోతున్నారని కాంగ్రెస్ పార్టీ జాతీయ కిసాన్ సెల్ అధ్యక్షుడు కోదండరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం బుద్వేల్ వేలం పాట భూములను పరిశీలించడానికి వెళ్తున్న కోదండరెడ్డిని. ఆ పార్టీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో కోదండరెడ్డి వాగ్వాదానికి దిగారు. భూములను పరిశీలించడానికి వస్తే అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల పాలనలో భూదాహం తీరడం లేదని, పేద రైతుల నోట్లో ప్రభుత్వం మట్టి కొడుతుందని ఆరోపించారు. బుద్వేల్‌లో సర్వే నెంబర్ 282, 299లో 255 ఎకరాల అసైండ్ భూములను ప్రభుత్వం కుట్రపూరితంగా బలవంతంగా లాక్కున్నారని మండిపడ్డారు. బుద్వేల్ దళితుల భూములను దళితులకు తిరిగి ఇచ్చే వరకు భూ పోరాటం చేస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు.

వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



కమిషనర్ హరీష్‌కు బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్న శ్రీధర్

రాజేంద్రనగర్: భారీ వర్షాలకు ఇళ్లను కోల్పోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కోరారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయానికి ఈవీఎం మిషన్ల పరిశీలనకు వచ్చిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్‌ను కలిసి అకాల వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో ఇంటి నెంబర్ 1-9-174 ఇళ్లు వర్షాలకు కూలిపోయిందన్నారు. కురిసిన వర్షాలకు తాము గూడు కోల్పోయామని తమకు న్యాయం చేయాలని ఆశ్రయించారన్నారు. దీంతో కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని తక్షణమే న్యాయం చేయాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు. గృహలక్ష్మి పథకం కింద జీహెచ్ఎంసీ ఫార్వార్డ్ చేయాల్సిందిగా సూచించారన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి



రామిరెడ్డి

అత్తాపూర్: ఉపాధాయ్యులు విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి జి.రామిరెడ్డి అన్నారు. ఇటీవల అత్తాపూర్‌లోని ఎస్‌ఆర్‌డీజీ పాఠశాలలో పీఈటీ విద్యార్థునుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తీరుపై ఆయన పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధాయ్యులుగా నియమించుకునే సమయంలో వారి విద్యార్హతలు, వారి నైపుణ్యాల పట్ల శ్రద్ధ కనబరిస్తే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కావని ఆయన తెలిపారు. పాఠశాలల నుంచి ఇతర పాఠశాలల్లో చేరేందుకు నిర్ణయించుకున్న విద్యార్థులను అత్తాపూర్‌లో ఉన్న భాష్యం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను, గౌతమ్ మోడల్ స్కూల్‌లో మరో విద్యార్థినులను చేర్పించి ఆ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చూసేందుకు యాజమాన్యాలతో మాట్లాడినట్లు ఎంఈవో రాంరెడ్డి 'సాక్షి'కి వివరించారు.

మొక్కలు నాటి భారీ వృక్షాలుగా ఎదిగేలా చూడాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: హరితహారంలో నాటి మొక్కలు భారీ వృక్షాలుగా ఎదిగేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్‌లోని ఆదర్శ నగర్‌కాలనీ గణేష్ మండపం వద్ద హరితహారంలో భాగంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ స్పెషల్ బ్లాక్, సీ-బ్లాక్‌లలో హరితహారంలో భాగంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు మేయర్ మహేందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, లడ్డూ, హఫీజ్‌ఖాన్, సుమన్, నదీం, బిల్ కలెక్టర్ అస్లాం, కాలనీవాసులు పాల్గొన్నారు.

షీ టీం ఆధ్వర్యంలో అవగాహన

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులోని స్వర్ణ భారత్ ట్రస్టులో షీ టీం ఆధ్వర్యంలో జాగృతి కళా బృందం చేత పలు అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. షీ టీం విధులు, ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలను వివరించారు. బాల్య వివాహాలు, భరోసా కౌన్సెలింగ్, మహిళల అక్రమ రవాణా నివారణ, స్టైల్ టీం, సైబర్ క్రైం అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్‌వీఎస్ లక్ష్మి, సిబ్బంది

అత్తాపూర్: దేశ ఔనత్యాన్ని చాటి చెబుతూ సగర్వంగా ప్రతి ఇంటిపై పంద్రాగస్టు రోజున జెండా ఎగరవేసుకోవాలని హైదర్‌గూడ సబ్ పోస్టు మాస్టర్ బీఎస్‌వీఎస్ లక్ష్మి అన్నారు. ఈ మేరకు హైదర్‌గూడ తపాల శాఖ ఉద్యోగులతో కలిసి ప్రాంతంలో త్రివర్ణ జెండాలను చేతబూని పంద్రాగస్టు రోజు తమ తమ ఇళ్లపై జెండా ఆవిష్కరించుకోవాలని కోరారు. జాతీయ జెండాలను పోస్టు ఆఫీసులో నామమాత్రం ధరలకే విక్రయించడం జరుగుతుందని కావాల్సిన వారు హైదర్‌గూడ పోస్టు ఆఫీసులో రూ.25 చెల్లించి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

బండ్లగూడ: ప్రతి సంవత్సరం తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకునేందుకు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, కిస్మత్‌పూర్ ఆలయ కమిటీ చైర్మన్ నీరుడు శేఖర్‌ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. అన్ని దానాల్లో రక్తదానం ఎంతో గొప్పదన్నారు. ప్రతి సంవత్సరం తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకునేందుకు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు 12న శనివారం కిస్మత్‌పూర్ ఓంనగర్ హనుమాన్ ఆలయ ప్రాంతంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం స్వర్గీయ నీరుడు విఠలయ్య వర్ధంతిని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేదలకు స్పోర్ట్స్ డ్రెస్, షూస్‌లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం బీజేపీ నాయకుడు అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో మిల్లెట్స్ టిఫిన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వర్క్ బుక్స్ అందజేత



విద్యార్థులకు వర్క్ బుక్స్ అందజేస్తున్న కార్పొరేషన్ కార్పొరేటర్ పద్మావతి

బండ్లగూడ: విద్యార్థులు చక్కగా చదువుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని బండ్లగూడజాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్ అన్నారు. పీఅండ్‌టీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం కొత్తగా అమలు పరిచిన వర్క్ బుక్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అధునాతన పద్ధతిలో ఆధునీకరిస్తూ విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకోని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో నదమ్, జ్యోతి, సావిత్రి, జగదీష్, రాజుయాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు శక్తియుక్తులతో ముందుకు సాగాలి

గచ్చిబౌలి: మహిళలు శక్తివంతంగా ముందుకు సాగాలని డాక్టర్ శిల్పిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డా. శిల్పిరెడ్డి పేర్కొన్నారు. డా.శిల్పిరెడ్డి ఫౌండేషన్, సీఐఐ-ఐడబ్ల్యూఎన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ మహిళల గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని శుక్రవారం కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించడానికి అవసరమైన సాధనాలు, మద్దతును అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలతో వారిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఆకట్టుకున్న పరేడ్

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో వార్షిక ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సెరిమోనియల్ పరేడ్ ఆకట్టుకుంది. బెటాలియన్ కమాండెంట్ సి సన్నీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ముఖ్య అతిథిగా టీఎస్ఎస్‌పీ డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీ పాల్గొన్నారు. అనంతరం సిబ్బందిచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. పరేడ్ కమాండర్‌గా అసిస్టెంట్స్ కమాండెంట్ డి నారాయణదాసు వ్యవహరించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్స్ రహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



మొక్కలకు నీరు పోస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహం

మణికొండ: వాతావరణంలో ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయడానికి చెట్లు ప్రధాన వనరులు అవి కార్బన్ డయాక్సైడ్ స్థాయిని తగ్గించడంలో సాయపడతాయని సీబీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహం వెల్లడించారు. గండిపేట్‌లని చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఏఐసీటీఈ మాసివ్ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్-2023లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2023ని పురస్కరించుకొని హరితహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం గ్లోబల్ వార్మింగ్ సమస్యను ఎదుర్కొంటుందన్నారు. అలాంటి సమస్యను అధిగమించడానికి చెట్లను నాటడం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు చెట్ల మొక్కలు నాటేలా ప్రోత్సహించేందుకు ఒక విద్యార్థి ఒక చెట్టు ప్రచారం గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరీష్

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ ఈవీఎం గోడౌన్స్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల నెలవారి తనిఖీల్లో భాగంగా శుక్రవారం కలెక్టర్ హరీష్ ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచి తనిఖీ చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సైదులు, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులున్నారు.

ఎయిర్‌పోర్టులో ట్రాఫిక్ రద్దీ పరిశీలన



ఎయిర్‌పోర్టులో ట్రాఫిక్ రద్దీని పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల చోటు చేసుకుంటున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంలో భాగంగా పోలీసులు నిత్యం పర్యవేక్షణ చేపడుతున్నారు. శుక్రవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఎయిర్‌పోర్టులోని అరైవల్, డిపార్చుర్ టెర్మినళ్లను పరిశీలించారు. విదేశాలకు రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు, ఇతర ప్రయాణికుల వెంట స్వాగత, వీడ్కోలు కార్యక్రమాలకు జనం పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ఎయిర్‌పోర్టులో విపరీతమైన రద్దీ నెలకొంటోంది. దీనిని నియంత్రించేందుకు ఎయిర్‌పోర్టు అధికారులతో కలిసి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. తక్కువ సంఖ్యలో మాత్రమే రావాలని ఇప్పటికే పలుమార్లు సూచించారు.

ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్.. ముగ్గురికి గాయాలు

శంషాబాద్: పట్టణంలోని బహదూర్ అలీ మక్తాలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని మక్తాలో అద్దె చెన్నం శ్రీనివాస్ ఇంట్లో తిరుపతమ్మ, నర్సింహ దంపతులు ముగ్గురు పిల్లలు నివాసముంటున్నారు. గురువారం అర్ధరాత్రి గ్యాస్ లీకేజీ అయినట్లు వాసన రావడంతో స్టౌవ్‌ను బంద్ చేసి నిద్రపోయారు. తెల్లవారు జామున నర్సింహ బీడీ ముట్టించుకునే సమయంలో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ ఇంటి పైకుప్పు ఎరిగిపోవడంతో పాటు తిరుపతమ్మ, నర్సింహ దంపతులతో పాటు వారి కుమార్తెకు కాలిన గాయాలయ్యాయి.సమాచారం తెలుసుకున్న స్థానికులు వారికి వెంటనే 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సిలిండర్ పేలుడు జరిగిన ఇంటిని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, స్థానిక కౌన్సిలర్ వై.కుమార్ సందర్శించి పరిశీలించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చార్మినార్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి నియోజకవర్గం ప్రజలను కోరారు. శుక్రవారం పురానీహవేలిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. దళిత బంధు, బీసీ బంధులతో పాటు మైనార్టీలకు పూర్తి సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం గృహలక్ష్మి పథకం వంటి తదితర సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం గృహలక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తులను అందజేశారు.